క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఆగస్టు 1న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. ఎక్సైజ్ కాలనీ, సుబేదారి పోలీస్ స్టేషన్, కేఎల్ఎన్ రెడ్డి కాలనీ, రెవెన్యూ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

6న అలీఖాన్ ప్రథమ వర్ధంతి



ఖిలా వరంగల్: ఈనెల 6న వరంగల్ క్రిస్టియన్ కాలనీ, తెలంగాణ జంక్షన్ వద్ద నిర్వహించనున్న ఉర్దూ దినపత్రిక ఎడిటర్ జహిరుద్దీన్ అలీఖాన్ ప్రథమ వర్ధంతి, చుండూరు దళిత మృతవీరుల 33వ వర్ధంతి యాదిసభను విజయవంతం చేయాలని సామాజిక ప్రజాకవుల కళాకారుల స్మారక కమిటీ రాష్ట్ర కన్వీనర్ గడ్డం శరత్, ధర్మ సమాజ పార్టీ జిల్లా కమిటీ అధ్యక్షుడు కేడల ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ శంభునిపేట జంక్షన్‌లో నాయకుడు కుమారస్వామి అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో యాదిసభ కరపత్రాలను ఆవిష్కరించారు.

దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలి

నయీంనగర్: దివ్యాంగులపై ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని దివ్యాంగ సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఉమ్మడి రాష్ట్ర దివ్యాంగుల సహకార సంస్థ మాజీ డైరెక్టర్ కంప వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్షమాపణ చెప్పకుంటే దివ్యాంగులంతా ఏకమై తెలుగు రాష్ట్రాల్లో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎండీ.ఖాజా అలీ, ఎస్.వేణుగోపాల్ పాల్గొన్నారు.

అధ్యాపకురాలికి అభినందన



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం ఒప్పంద అధ్యాపకురాలు దాసరి శైలజ.. మద్రాస్ ఐఐటీ నుంచి ప్రశంసపత్రం అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విశాల మహేందర్ తెలిపారు. భారత ప్రభుత్వ మానవ వనరుల మంత్రిత్వ శాఖ, దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీల ఆధ్వర్యంలో స్వయం పోర్టల్ ద్వారా నేషనల్ ప్రోగ్రాం ఇన్ టెక్నాలజీ ఎన్‌హ్యాన్స్‌డ్ లెర్నింగ్ న్యాప్టెల్ ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న 13 ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులను శైలజ పూర్తి చేశారని తెలిపారు. ఈ మేరకు ఆమెను కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, ఆ విభాగం అధిపతి డాక్టర్ భిక్షాలు, తదితరులు బుధవారం అభినందించారు.

ఘనంగా మైసమ్మ బోనాలు

ఖిలా వరంగల్: వరంగల్ 40వ డివిజన్ ఉర్సు కరీమాబాద్ డీకే.నగర్‌లో మైసమ్మ బోనాలను స్థానికులు బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. మహిళలు అమ్మవారికి నైవేద్యంగా పరమాన్నాన్ని సమర్పించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరై బోనమెత్తారు. కార్పొరేటర్ మరుపల్లి రవి, పూజారి విజయ్, సందీప్, కుడా మాజీ డైరెక్టర్ మోడెం ప్రవీణ్ పాల్గొన్నారు.

జీఎంహెచ్‌లో పండ్ల పంపిణీ



హన్మకొండ చౌరస్తా: రోటరీ క్లబ్ ఆఫ్ హనుమకొండ ఆధ్వర్యంలో హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలోని బాలింతలు, గర్భిణులకు బుధవారం పండ్లు పంపిణీ చేశారు. మాతా, శిశు ఆరోగ్య పోషణలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో జీఎంహెచ్ ఆర్ఎంఓ డాక్టర్ అంబరీష్, క్లబ్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, సభ్యులు విజయ్‌కుమార్, రాజారెడ్డి, రవీందర్‌రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

తీజ్‌కు జాతీయ హోదా కల్పించాలి

కాజీపేట: బంజారా, లంబాడీ సంస్కృతి, సంప్రదాయాన్ని చాటి చెప్పే పండుగల్లో అతి ముఖ్యమైన తీజ్ పండుగను జాతీయ పండుగగా ప్రకటించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రొఫెసర్ డాక్టర్ సీతారాం నాయక్ అన్నారు. కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలోని తన స్వగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంత్ సేవాలాల్ విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ప్రతిష్ఠించాలన్నారు.

ఎంఈఓపై చర్య తీసుకోవాలి

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల విద్యాశాఖాధికారి రామకృష్ణరాజుపై చర్యలు తీసుకోవాలని ఎబీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాగుల పవన్‌కల్యాణ్ కోరారు. ఈమేరకు జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్‌హైకి బుధవారం ఫిర్యాదు చేశారు.

అవగాహన సరే.. ఆచరణ ఏది?

- కంపు కొడుతున్న శాయంపేట మండల పరిషత్ కార్యాలయ ఆవరణ
- వర్షపు నీటితో పేరుకుపోయిన చెత్తాచెదారం
- ఫిర్యాదుదారులకు తప్పని తిప్పలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నిలిచిన వర్షపు నీరు, పేరుకుపోయిన చెత్తాచెదారం


శాయంపేట : 'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి. చెత్తాచెదారం, వరద నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలి' అని గ్రామగ్రామాన అవగాహన సదస్సులు నిర్వహించే అధికారులు.. తాము విధులు నిర్వర్తించే కార్యాలయ ఆవరణ మాత్రం అపరిశుభ్రంతో కంపు కొడుతున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం సమస్యలకు నిలయంగా మారుతోంది. పనుల నిమిత్తం కార్యాలయానికి వస్తున్న ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కార్యాలయంలోని సమావేశ మందిరం గతంలో సమావేశాలతో కలకలలాడేది. కానీ ప్రస్తుతం వర్షం కురిస్తే వరదనీరు ఆవరణలో నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. ఇంతే కాకుండా వర్షపునీరు భవనం పైన, భవనం చుట్టూ నిలవడంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. భవనం పగుళ్లుదేలడంతో భారీ వర్షం కురిసినప్పుడు వర్షపునీరు లోనికి రావడంతో కిటికీలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గోడలు తడిసి పోవడంతో విద్యుత్‌షాక్ వస్తుందని సిబ్బంది బెంబేలెత్తుతున్నారు. దీంతో ఎంపీడీఓ సమావేశహాల్, స్టాఫ్‌రూం శిథిలావస్థకు చేరుకున్నాయి.

అధికారుల గదులు సుందరీకరంగా..

మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ, ఎంపీడీఓతో పాటు పలు గదుల మాత్రం సుందరీకరంగా తీర్చిదిద్దుకున్నారని, ఇతర ఉద్యోగుల గదులను మాత్రం గాలికి వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని కార్యాలయ మరమ్మతులతో పాటు వరదనీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. కార్యాలయం వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కార్యాలయం స్లాబ్‌పై నిలిచిన వర్షం నీరు



కార్యాలయ సమావేశ మందిరంలో కురుస్తున్న వర్షపు నీరు



శిథిలావస్థకు చేరిన కిటికీలు

చర్యలు చేపడుతాం

ఎంపీడీఓ కార్యాలయ భవనం నిర్మించి దాదాపు 30 సంవత్సరాలు అవుతోంది. గతంలో ఎత్తుగా ఉన్న కార్యాలయం.. రోడ్డు ఎత్తవడంతో వంపుగా మారి వర్షం నీరు నిలుస్తోంది. వెంటనే చర్యలు చేపట్టి సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తాం.

\- ఫణిచంద్ర, ఎంపీడీఓ

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్

ఆత్మకూరు : గ్రామపంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని మండల ప్రత్యేక అధికారి రాజేందర్ హెచ్చరించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పలు గ్రామాల్లో కార్యదర్శులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని సమాచారం వచ్చిందని, పద్ధతి మార్చుకోవాలని లేనిపక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ భానుకుమార్, ఎంపీఓ విమల, ఏపీఓ రాజిరెడ్డి పాల్గొన్నారు.

సీకేఎం ఆస్పత్రి సమస్యలు పరిష్కరించాలి

కాశీబుగ్గ సెంటర్: వరంగల్‌లోని సీకేఎం మహిళా ప్రసూతి దవాఖానలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఐద్వా వరంగల్ జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల కోరారు. ఈమేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ సత్యశారదాదేవిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రత్నమాల మాట్లాడుతూ ఉత్తర తెలంగాణలో అతిపెద్దదైన సీకేఎం ప్రసూతి ఆస్పత్రిలో సౌకర్యాలు లేక గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా నాయకులు టి.భవాని, ఎస్.రేణుక, బి.సంగీత, ఎండి.బేగం పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ప్రత్యేక అధికారిగా బాలరాజు



దామెర : మండల ప్రత్యేక అధికారిగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు పనిచేసిన మాధవీలత బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో బాలరాజుకు ఉన్నతాధికారులు బాధ్యతలు అప్పగించారు. కాగా ఆయనను ఎంపీడీఓ కల్పన, ఏపీఓ శారద, కార్యాలయ సిబ్బంది శాలువాతో సత్కరించి, పూలమొక్క అందించారు.

బాధ్యతలు చేపట్టిన రామ్‌కిషన్‌రాజ్



ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని విద్యవనరుల కార్యాలయంలో బుధవారం ఎర్ర రామ్‌కిషన్‌రాజ్ ఎంఈఓగా బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు హసన్‌పర్తిలో విధులు నిర్వర్తించిన ఆయన బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఈసారి రవీందర్ హసన్‌పర్తి మండలానికి బదిలీపై వెళ్లారు. ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన రామ్‌కిషన్‌రాజ్‌కు ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నోట్‌బుక్స్ పంపిణీ

ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్‌లో గల ఎంజేపీ గురుకుల పాఠశాలలో బుధవారం మా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. విద్యార్థులు చదువులో రాణించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి శివప్రసాద్, ప్రిన్సిపాల్ అనిత పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం

ఐనవోలు : మండల కేంద్రానికి చెందిన ఎండీ గౌస్‌పాషా కుమారుడు అబ్దుల్ కాదిర్ జూలై 25వ తేదీన బ్లడ్‌క్యాన్సర్‌తో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గౌస్‌పాషాతో 2006–2007లో పదోతరగతి చదువుకున్న మిత్రులు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. చిన్నరాజు, రాజు, రఘు, రవి, శ్రవణ్ పాల్గొన్నారు.

వాటర్‌ట్యాంక్ బహూకరణ



నడికూడ : మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం వరంగల్ జిల్లా కల్లెడ గ్రామానికి చెందిన తాళ్లపల్లి రాజు–శ్రావ్య దంపతులు వారి సోదరి తాళ్లపల్లి హైమా జ్ఞాపకార్థం ఆర్వో వాటర్‌ట్యాంక్‌ను బహూకరించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్ ఉన్నారు.

శివాజీ యువసేన ఆధ్వర్యంలో రక్తదానం

హన్మకొండ (పరకాల) : బీజేపీ జిల్లా కార్యదర్శి, 21వ వార్డు కౌన్సిలర్ ఆర్పీ జయంత్‌లాల్ జన్మదినం సందర్భంగా శివాజీ యువసేన ఆధ్వర్యంలో యువకులు రక్తదానం చేశారు. బుధవారం పరకాల సివిల్ ఆసుపత్రి ఆవరణలోని బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం శిబిరాన్ని నిర్వహించారు. జయంత్‌లాల్ సందర్శించి తనపై అభిమానంతో రక్తదానం చేయడం సంతోషకరమని అన్నారు. ఆపదలో ఉన్న వారికి రక్తం ప్రాణం పోస్తుందని అన్నారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేయడం అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శివాజీ యువసేన నాయకులు వెనిశెట్టి రాజేశ్, అర్జున్, ఆనంద్, బీజేపీ నాయకులు నర్సింగరావు, తిరుపతి పాల్గొన్నారు.

నలుగురికి జరిమానా

శాయంపేట : నంబరుప్లేట్ లేని వాహనాలు నడిపిన కేసులో నలుగురు వ్యక్తులకు రూ.2,500 చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై ప్రమోద్ కుమార్ తెలిపారు. శాయంపేట మండలానికి చెందిన సాదు నాగరాజు, తోకేటి లోకేశ్, ఓర్సు శ్రీనివాస్, మేరుగు అనిల్ ఈనెల 30న నంబర్ ప్లేట్ లేని వాహనాలను నడపడంతో కేసు నమోదు చేసిన పోలీస్‌లు వారిని కోర్టులో హాజరు పరిచారు. వారికి జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ లింగం శాలిని నలురుగు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ. 25,00 చొప్పున జరిమాన విధించినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

వేలేరు : మండల కేంద్రానికి చెందిన ఎండీ.సాజిద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతుండగా బుధవారం విషయం తెలుసుకున్న మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ బాధితుడిని పరామర్శించారు. ఈ మేరకు రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. మాజీ వార్డు సభ్యుడు ఉన్నారు.

ఆలం గ్యాస్ విడుదలతో ఎర్రబడిన వరినారు



ఆలం గ్యాస్ ప్రభావంతో ఎర్రబడిన వరినారును చూపిస్తున్న రైతు రవీందర్

శాయంపేట: ఇంటింటికి శుభ్రమైన తాగునీరందించేందుకు గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ప్రవేశపెట్టి, నీటి శుద్ధి చేసేందుకు వినియోగించిన అలం కెమికల్‌తో కూడిన గ్యాస్‌ను పంట పొలాల మీదుగా విడుదల చేయడంతో 2.30 ఎకరాల్లో సాగు కోసం పోసుకున్న నారు కొనలు ఎర్రబడి వాడిపోయాయి. ఈవిషయాన్ని పవర్ గ్రిడ్ అధికారులకు విన్నవించుకున్నా.. పట్టించుకోవడం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. మండలంలోని జోగంపల్లి గ్రామానికి చెందిన రైతు చెక్క రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రిడ్ పక్కన 1.10 ఎకరాల భూమి ఉంది. అందులోని 10 గుంటల్లో సన్న రకం 60 కిలోల విత్తనాలు, దొడ్డు రకం 50 కిలోల వరి విత్తనాల్ని నారుపోశాడు. నాట్లు వేసేందుకు సిద్ధపడుతున్న తరుణంలో ఈనెల 25న భగీరథ పంప్ హౌజ్ నుంచి నీటిని శుద్ధి చేసే అలం వినియోగించిన కెమికల్ గ్యాస్‌ను విడుదల చేశారు. దీంతో అతడి వరి నారు కొనలు మొత్తం ఎర్రబడిపోయాయి. ఈ విషయాన్ని గ్రిడ్ అధికారులకు, పంప్ హౌజ్ సూపర్‌వైజర్ దృష్టికి తీసుకెళ్లాడు. అయినప్పటికీ ఎవరూ స్పందించడం లేదని రైతు వాపోయాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అలం గ్యాస్‌తో నష్టపోయిన వరి నారుకు రూ. 30 వేలు పరిహారం ఇవ్వాలని బాధిత రైతు రవీందర్ కోరారు. పరిహారం చెల్లిస్తే ధాన్యం విత్తనాలు కొని వెదజల్లే పద్ధతిలో సాగు చేసుకుంటానని తెలిపారు.

ఉత్తర్వులు అమలు చేయాలి

హసన్‌పర్తి: రామారంలో ఇళ్ల నిర్మాణాల కూల్చివేతలో లోకాయుక్త ఇచ్చిన ఉత్తర్వులను కార్పొరేషన్ అధికారులు బుట్టదాఖలు చేశారని బాధితుడు తోట వీరస్వామి ఆరోపించారు. 55వ డివిజన్‌లోని రామారంలో తోట రామస్వామి, బానోతు చక్రు భవనాలు నిర్మించుకున్నారు. దారి విషయమై ఇరువురి మధ్య వివాదం తలెత్తింది. దీంతో వారిద్దరు లోకయుక్తలో ఫిర్యాదు చేశారు. కట్టడాలు కూల్చివేసే క్రమంలో బానోతు చక్రు అందుబాటులో లేన్నందున ఆ నిర్మాణాన్ని తర్వాత కూల్చివేస్తామని తోట రామస్వామికి అధికారులు తెలిపారు. దాంతో రామస్వామి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ లోకయుక్త ఆదేశాల మేరకు ఇరువురి నిర్మాణాలు ఒకేసారి కూల్చివేయాలని పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. చక్రుకు మరోసారి నోటీసు ఇచ్చి, స్పందించకుంటే స్థానికంగా పంచనామా నిర్వహించి ఆ కట్టడాన్ని కూడా తొలగిస్తామని అధికారులు చెప్పారు.

ప్రజల భద్రతే పోలీసు లక్ష్యం

- ఏసీపీ కిశోర్‌కుమార్



మాట్లాడుతున్న పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్

నడికూడ : ప్రజల భద్రతే పోలీసుల లక్ష్యమని పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్ అన్నారు. మండలంలోని ధర్మారం గ్రామంలో బుధవారం సీఐ కాంత్రికుమార్, ఆత్మకూరు సీఐ సంతోష్‌కుమార్, శాయంపేట సీఐ రంజిత్‌రావు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామ ప్రధాన రహదారులను దిగ్బంధించి ఇంటింటా సోదాలు నిర్వహించారు. తనిఖీల్లో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 28 బైక్‌లు, 3 ఆటో యజమానులకు రూ.13,100 జరిమానా విధించారు. బెల్టు షాపుల్లో విక్రయిస్తున్న రూ.4,950 విలువచేసే మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం ఏసీపీ మాట్లాడారు. ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసు యంత్రాంగం పనిచేస్తుందన్నారు. ప్రజలు సైబర్ నేరాలపైన అవగాహన పెంచుకోవాలని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అత్యవసర సమయంలో సాయం కోసం డయల్ 100 సమాచారం ఇవ్వాలని సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యువతకు సూచించారు. పరకాల డివిజన్ ఎస్సైలు, 30 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

- మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి

కమలాపూర్ : ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని మండల ప్రత్యేకాధికారి జి.రాంరెడ్డి సూచించారు. ఎంపీడీఓ గుండె బాబు, పంచాయతీరాజ్ ఏఈ మధుతో కలిసి బుధవారం ఆయన మండలంలోని అంబాల, శనిగరం, మర్రిపల్లిగూడెం గ్రామాల్లో గల అమ్మ ఆదర్శ పాఠశాలకు రెండో విడత మంజూరైన పనుల ప్రగతితోపాటు ఆయా పాఠశాలల రికార్డులను పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులు త్వరితగతిన పూర్తి చేయించాలని పంచాయతీరాజ్ ఏఈకి సూచించారు. ఉపాధ్యాయులు ముందస్తు సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు కావొద్దని, తప్పనిసరిగా ముందుగా అనుమతి తీసుకోవాలని అన్నారు. విద్యార్థులు డిజిటల్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, పంచాయతీ కార్యదర్శి శరత్, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

'అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం'

ఆత్మకూరు : అక్రమ అరెస్టులు అప్రజాస్వామికమని బీజేపీ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు వేములపల్లి శ్రీలత అన్నారు. అసెంబ్లీ ముట్టడిలో భాగంగా భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా నాయకులను బుధవారం ఉదయం స్థానిక పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ.. మహిళా మోర్చా అధ్వర్యంలో ఛలో అసెంబ్లీ ముట్టడి ఉన్నందున పోలీస్‌లు తమను వెళ్లకుండా అరెస్టు చేయడం హేయమైన చర్యన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు రూ.2500 నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తామని మోసం చేస్తున్నారని ఆరోపించారు. త్వరలోనే జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలు కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారన్నారు. అరెస్టు అయిన వారిలో మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు వేములపల్లి శ్రీలత, ఉపాధ్యక్షురాలు రాణి, కార్యదర్శి రోజా ఉన్నారు. కాగా వారికి బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు సదానందం, సుమన్ పోలీస్ స్టేషన్‌లో కలిసి సంఘీభావం తెలిపారు.

కబడ్డీ అసోసియేషన్ నియామకం



కిరీటి



అనిల్

ఆత్మకూరు : కబడ్డీ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా ఆత్మకూరు గ్రామానికి చెందిన బరుపట్ల కిరీటి, ప్రధానకార్యదర్శిగా నీరుకుళ్ల గ్రామానికి చెందిన కీత అనిల్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు సారంగపాణి బుధవారం వెల్లడించారు. గ్రామాల్లోని యువతలో దాగిఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు నూతన కమిటీ సహకరించాలని సూచించారు. తమ నియామకానికి సహకరించిన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, ప్రధానకార్యదర్శికి వారు కృతజ్ఞతలు తెలిపారు.



ఈర్ల చిన్ని



ఓంకార్

నడికూడలో..

నడికూడ : కబడ్డీ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా నార్లపూర్ గ్రామానికి చెందిన ఈర్ల చిన్ని, ప్రధాన కార్యదర్శిగా నర్సక్కపల్లి గ్రామానికి చెందిన ఆవుల ఓంకార్‌ను ఎన్నుకన్నారు. తమపై నమ్మకంతో ఎన్నుకున్న కమిటీ సభ్యులకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన సదస్సులో పాల్గొన్న మహిళా సంఘాల సభ్యులు

శాయంపేట : ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు పెరిగాయని, ప్రతిఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ మారేపెల్లి క్రాంతికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో వీఓఏలు, మహిళా సంఘాల సభ్యులకు బుధవారం అవగాహన నిర్వహించగా ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ అడిగితే చెప్పవద్దని అన్నారు. యువత డబ్బుల కోసం మనీ ఆప్స్ ద్వారా లోన్ తీసుకొని ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని అన్నారు. తల్లిదండ్రులు పిల్లల నడవడికపై ప్రత్యేక దృష్టి వహించాలన్నారు. ఆన్‌లైన్ మోసాల బారిన పడినవారు వెంటనే సైబర్ క్రైమ్ పోలీస్‌లను ఆశ్రయించాలని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరికి జీవిత బీమా ఉండాలని, ప్రమాదవశాత్తు మృతి చెందితే రెండు లక్షల బీమా వర్తిస్తుందని అన్నారు. పీఎం జీవన జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్, సుకన్య సమృద్ధి యోజన అనేక ఇన్సూరెన్స్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఏపీఎం శ్రీధర్‌రెడ్డి, సీసీలు, మహిళా సంఘాల సభ్యులు, కౌన్సిలర్ విజయ్ పాల్గొన్నారు.

సీతారామచంద్ర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు



ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు

మడికొండ: మడికొండలోని మెట్టుగుట్టపై ఉన్న సీతారామచంద్ర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 8గంటలకు భగవత్ప్రార్థన, విష్వక్షేప ఆరాధన, పంచగవ్య ఆరాధన, ప్రాశన, వాస్తుపూజ, హోమం, అకల్మశ హోమం, రక్షాబంధనం, దీక్షధారణ, నీరాజనం అనంతరం సాయంత్రం 6గంటలకు విష్వక్షేప ఆరాధన, పున్యాహం, మేధిని పూజ, అంకురార్పణ, ఆదివాసాంగ హోమం, నీరాజనం, కుంభసాధనం, ఆరాధనం, మొదలగు కార్యక్రమాలను నిర్వహించినట్లు ఈఓ శేషుభారతి వివరించారు. శివాలయ చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు పరాశరం విష్ణువర్ధనచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, ధర్మకర్తలు రొడ్డ దయాకర్, దండిగం శ్రీనివాస్, బోగి కేదారి, బైరి రాజుగౌడ్, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, వస్కుల ఉమ, సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు సన్మానం

కాజీపేట: మూడున్నర దశాబ్దాలుగా ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఏదులాపురం వెంకటనారాయణను కాజీపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో సీఐ చంద్రమోహన్, సిబ్బంది బుధవారం సన్మానించారు. ఖలీల్, కోటిలింగం, రవీందర్, లాలయ్య పాల్గొన్నారు.